క్లుప్తంగా

రామలింగేశ్వరుడి సేవలో దేవదాయ శాఖ కమిషనర్



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. కార్తికమాసం మొదటి సోమవారం సందర్భంగా కమిషనర్ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు కమిషనర్ సత్యనారాయణను శేషవస్త్రంతో సత్కరించి దేవస్థానం ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో ఈవో ఎం.గంగాధరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

అటల్ థింకరింగ్ ల్యాబ్‌తో అద్భుత ఫలితాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అటల్ థింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థుల్లో అద్భుతమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ ఎం.హుస్సేన్ అన్నారు. పాతబస్తీలో ఎంఎస్ఆర్ హైస్కూల్‌లోని అటల్ థింకరింగ్ ల్యాబ్‌ను డాక్టర్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. వివిధ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఎంఎస్ఆర్ హైస్కూల్ ప్రదర్శించిన సైన్స్ నమూనాలను ఆయన పరిశీలించి అభినందించారు. అనంతరం ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ జీవితంపై సైన్స్ గొప్ప ప్రభావాన్ని చూపుతుందన్నారు. విద్యార్థులు సైన్స్ నమూనాలపై మరింత అవగాహన పెంచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం శివాలయం సెంటర్‌కు చెందిన జై హనుమాన్ భక్త బృందం అండ్ జీఆర్ఆర్, బీఎంఆర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి కలశపూజ, 3వ పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భారీగా నిర్మించిన వేదిక వరకు 18 మెట్లు ఏర్పాటు చేయగా పైన అరటి దొప్పలతో స్వామివార్ల పూజా మందిరాలను నిర్మించారు. కేరళ సంప్రదాయ రీతిలో రాము గురుస్వామి పూజాధికాలను నిర్వహించారు. స్వామివారికి పంచహారతులు, హరివరాసనం నిర్వహించారు. గాయకులు కుమార స్వామి కీర్తనలు ఆలపించారు. కాంప్లెక్స్ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగింది. పీఠాధిపతి, గురుస్వామి జి.రమణారెడ్డి, గురుస్వామి మల్లేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన పడిపూజా మహోత్సవంలో వేలాదిగా అయ్యప్పలు, భవానీలు, గోవింద స్వాములు పాల్గొన్నారు.

రేపటి నుంచి కేబీఎన్‌లో ఏఐపై జాతీయ సదస్సు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో 'రసాయన శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు' అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో సదస్సు పోస్టర్‌ను ఆయన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త అణువులు, వ్యాధి లక్షణాల తదితర అంశాలపై ఔషధాలను తయారు చేయటానికి, నూతన పరిశోధనలకు ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ అండగా ఉంటుందదన్నారు. దీనిపై చర్చించేందుకు దేశ వ్యాపితంగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి విద్యావేత్తలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 22వ తేదీన జరిగే ప్రారంభ సభకు ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య కే రామమోహనరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. 23వ తేదీన జరిగే ముగింపు సభకు కృష్ణా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

తొలి సోమవారం కావడంతో ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పవిత్రమైన కార్తిక మాసం తొలి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమశివుడిని స్మరించుకుంటూ భక్తులు చేసిన హరనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. తెల్లవారుజాము నుంచి శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగార్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రధానంగా ఆయా ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం, సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించారు.

పాతశివాలయంలో....

వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో నక్త దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, దశశాంతులు, సహస్రనామార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. భ్రమరాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అలాగే వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి అనూరాధ పర్యవేక్షించారు.

విజయేశ్వరస్వామి వారి దేవస్థానంలో....

పాతబస్తీలోని అర్జునుడు ప్రతిష్ఠించిన విజయేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దశ శాంతులు, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ధర్మేశ్వరస్వామి వారి దేవస్థానంలో..

కొత్తపేటలోని శ్రీ గంగా పార్వతీ సమేత ధర్మేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీ గంగానమ్మ దేవస్థానంలో....

శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో కొలువై ఉన్న పరమశివునికి సోమవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాధి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త వాండ్రాసి సాధూరావు పర్యవేక్షించారు. రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకాలు, పూజా కార్యక్రమాలను జరిపారు. సాయంత్రం విశేష అభిషేకాలు, పంచ హారతుల సేవ అనంతరం స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌లు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించగా, భక్తులు కార్తిక దీపాలను వెలిగించి, స్వామి వారికి పూజలు నిర్వహించారు.



స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహిస్తున్న అర్చకులు



పాత శివాలయం పూజల్లో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, ఎమ్మెల్యే వెలంపల్లి



సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న అర్చకుడు



పాత శివాలయంలో భక్తుల రద్దీ



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



విశేష అలంకరణలో స్వామివారు

యనమలకుదురు ఆలయంలో..



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం కార్తిక పూజలు నిర్వహించారు. మొదటి కార్తిక సోమవారం కావటంతో భక్తులు ఉదయం 5 గంటలకే ఆలయానికి వచ్చారు. స్వామివారికి ఏకరుద్రాభిషేకం, విశేష అలంకరణ, శాంతికల్యాణం చేశారు. రాత్రి కార్తిక దీపాలు వెలిగించారు. అనంతరం పటమటకు చెందిన హవీష్ చౌదరి కళాక్షేత్ర అకాడమీ చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ డైరెక్టర్ వీజీ రెడ్డి సతీమణి వీజీ బిందు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామికి విశేష పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం తొలి సోమవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న మల్లేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర స్వామి వారి బాలాలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిపారు. త్రికాల పూజలను నిర్వహించగా పలువురు ఉభయదాతలు పూజల్లో పాల్గొన్నారు. నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగార్చన నిర్వహించగా పలువురు భక్తులు పూజలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పంచహారతుల సేవ అనంతరం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలను జరిపించుకున్నారు.

స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించండి

- వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్
- స్పందనకు 30 ఫిర్యాదులు



స్పందనలో అర్జీని స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల నుంచి వచ్చిన స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం జరిగిన స్పందనలో ఆయన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని, అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై – 15, యూసీడీ విభాగం – 6, ఇంజినీరింగ్ విభాగం – 5, రెవెన్యూ, హెల్త్, ఎలక్షన్, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్)విభాగంపై ఒక్కో ఫిర్యాది అందిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) రోహిణి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) కె.లతా, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు

నూతన భవనం పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో జరుగుతున్న నూతన జీ ప్లస్ 9 భవనాన్ని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు.

భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రౌండ్, మొదటి, మూడవ అంతస్తు వాణిజ్యపరంగా కేటాయించగా, రెండవ అంతస్తులో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొన్ని విభాగాలకు కేటాయించామని చెప్పారు. లైటింగ్, ఇంటీరియర్, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నూరు శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌దే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్నికల్లో నూరు శాతం హామీలను నెరవేర్చి, మాట నిలబెట్టుకున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పాతబస్తీలోని 37వ డివిజన్ పరిధిలోని 185వ సచివాలయం పరిధిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వివరించే బోర్డును స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లోని ఆ సచివాలయం పరిధిలో పర్యటించారు. స్థానికంగా జరిగిన అభివృద్ధిని స్థానికులకు వివరించారు. అలాగే వ్యాపార వర్గాలతో సమావేశమై పురాతన విద్యుత్ వైర్లు తొలగింపు, నూతన లైన్ల ఏర్పాటు, ఇటీవల జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు గడిచిన నాలుగేళ్ల పాలనలో చేసిన మంచిని వివరిస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబు చేసిన అవినీతిని కూడా ప్రజలకు తెలుపుతున్నామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎన్ని అమలుచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు కన్నా ఎక్కువ హామీలు ఇచ్చి అమలు చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.



డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి

చంద్రబాబుకు బెయిల్ మాత్రమే వచ్చింది

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకి బెయిల్ మాత్రమే ఇచ్చారని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈ కేసును న్యాయస్థానం కొట్టేయలేదన్నారు. చంద్రబాబు దోషి అని, అది రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు.

దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి బెయిల్ తెచ్చుకున్నాడనీ ఎద్దేవా చేశారు. యువకులను మోసం చేసి జైలుకి వెళ్లిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అంతిమంగా చంద్రబాబు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, నాయకులు గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 91 ఫిర్యాదులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడటంతో పాటు దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి అర్జీలను స్వీకరించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ ఫిర్యాదుల్లో 24 నగదు లావాదేవీలకు సంబంధించినవి, 14 భార్యాభర్తలు, కుటుంబ కలహాలు, 21 సివిల్ వివాదాలు, వివిధ మోసాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు, 5 ఇంటి అద్దె, ఒక బైక్ దొంగతనం, ఇతర చిన్న చిన్న సమస్యలు మొత్తం 91 ఫిర్యాదులను డీసీపీ స్వీకరించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధుడి సమస్యను తెలుసుకుంటున్న డీసీపీ అజిత వేజెండ్ల

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 56వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు ఉత్సవం ఆ కళాశాల గ్రంథాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య సూర్యచంద్రరావు మాట్లాడుతూ.. గ్రంథాలయాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకున్నప్పుడే మంచి విజ్ఞాన సంపన్నులవుతారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను వినియోగించుకొని అనేక మంది గొప్ప మహనీయులుగా ఎదిగారన్నారు. అటువంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలకు నగర వ్యాపితంగా పాఠశాలలు, కళాశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరుకావటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, గ్రంథాలయ విభాగాధిపతి శ్రీనివాసురాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు నాగలక్ష్మి, విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

26 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందించేందుకు ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కమిటీ సభ్యులతో వర్చువల్‌గా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, విశ్వకర్మ యోజన, పోషన్ శక్తి నిర్మాన్ అభియాన్, జన్‌ధన్ యోజన తదితర పథకాలను ప్రచారం కల్పించాలన్నారు. రోజుకు రెండు పంచాయితీల్లో ప్రచార వాహనంతో చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా గ్రామీణ, పట్టణ, ఏజెన్సీ ప్రాంతాల్లో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. యాత్ర జరిగే రోజుల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు.

ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు జిల్లా స్థాయిలో డీపీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రచారానికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీపీవో జయచంద్ర గాంధీ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎ.నాగేశ్వరరావు, ఫిషరీస్ డీడీ నాగరాజా, అగ్రికల్చర్ జేడీ ఎస్.నాగమణమ్మ పాల్గొన్నారు.

తప్పు తెలుసుకుని పరివర్తన చెందినప్పుడే గుర్తింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలిసీ తెలియని వయసులో చేసిన తప్పును, ఆ తరువాత తెలుసుకుని పరివర్తన చెందినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ బీడీవీ ప్రసాదమూర్తి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం(జువెనైల్ హోమ్)లో సోమవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి, నిజాయతీతో వ్యవహరించి సమాజాభివృద్ధికి తోడ్పడిన నాడే వారి జీవితం సార్థకమవుతుందన్నారు. మహాత్మా గాంధీజీ అహింస, సత్యం సిద్ధాంతాలు, సుభాస్ చంద్రబోస్ వంటివారి పోరాట పటిమలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆంధ్ర హాస్పటల్ డాక్టర్ వినోద్ పిల్లలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ క్లాసులు నిర్వహించి, సర్టిఫికెట్లను అందజేశారు. యోగా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ విధానాల ద్వారా పిల్లలు మానసిక పరివర్తన చెంది సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారవ్వాలని కోరారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రసాదమూర్తి

విజేతలకు బహుమతుల అందజేత

జువెనైల్ హోమ్ సూపరింటెండెంట్ పి.రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యానంద యోగాశ్రమానికి చెందిన స్వామి భక్తి చైతన్యానంద సరస్వతి, చీఫ్ ప్రొహిబేషన్ సూపరింటెండెంట్ టి.మధుసూదనరావు, గుంటూరు జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డ్ ప్యానల్ లాయర్ మహాలక్ష్మి, ప్రొహిబేషన్ అధికారి హసన్ ఆలీ బేగ్ పాల్గొన్నారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చారు.

స్మృతివనం నిర్మాణంపై ప్రజా సంఘాల హర్షం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ స్వరాజ్ మైదానంలో ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం నిర్మించడం పట్ల ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి సోమవారం స్మృతివనాన్ని సందర్శించారు. ఈ నెల 26న జరిగే ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజా, దళిత, గిరిజన సంఘాలు, రాజకీయ పక్షాలను ఆహ్వానించాలని కోరారు. స్మృతివనం సందర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, బుట్టి రాయప్ప, వెంకట్రావు, ఈశ్వరరావు, కొండపల్లి కృష్ణ తదితరులు ఉన్నారు.

కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తూ అందులో ప్రజలను భాగస్వాములను చేయాలన్న సంకల్పంతో ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని క్వాంటమ్ ఎనర్జీ డీలర్ అధినేత చుంచు నరసింహారావు పేర్కొన్నారు. దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని భవానీపురం బైపాస్ రహదారిలోని ఓ 2 ఎలక్ట్రిక్ వాహనాల షోరూమ్‌లో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 20వ తేదీలోపు కొనుగోలు చేసిన కస్టమర్లకు ధరలో తగ్గింపుతో పాటు 20 గ్రాముల వెండి నాణెం అందజేశారు. సోమవారం సాయంత్రం తీసిన లక్కీ డ్రాలో 20 మంది ఎంపికకాగా వారిలో ప్రథమ బహుమతి ఎల్ఈడీ టీవీని గర్రె మాలిక గెలుచుకున్నారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. నరసింహారావు మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించటమే తమ లక్ష్యమని చెప్పారు.



విజేతకు టీవీని అందజేస్తున్న నరసింహారావు

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన చిట్టిబాబు, దివ్య(21) భార్యభర్తలు. చిట్టిబాబు తాపీ పని చేస్తుండగా, దివ్య ఇంటి వద్దే ఉంటుంది. సోమవారం ఉదయం చిట్టిబాబు పనికి వెళ్లగా మధ్యాహ్నం అతని తల్లి ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. దీంతో చిట్టిబాబుకు విషయం చెప్పగా వెంటనే ఇంటికి వచ్చాడు. 10.30 గంటల సమయంలో దివ్య బయటకు వెళ్లిందని స్థానికులు తెలిపారు. బంధువులను విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 43 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం సేవించి వాహనాలు నడిపే 43 మందికి జైలు, జరిమానా విధిస్తూ ఏడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తులు సోమవారం తీర్పునిచ్చారురు. వీరిలో ఒక వ్యక్తికి 19 రోజులు, రూ.10 వేలు జరిమానా, 18 మందికి 2 రోజుల నుంచి 15 రోజుల వరకు జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా, మరో ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు జరిమానా, మిగిలిన 22 మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు.